క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

రాయవరం: మండలంలోని పలు గ్రామాల విద్యార్థులకు, ప్రజలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కీర్తి స్పందన శుక్రవారం విలేకరులకు తెలిపారు. రాయవరం-2 సచివాలయంలో ఈ ప్రత్యేక క్యాంపును ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ఈ నెల 21న సోమేశ్వరం, 22న వెదురుపాక, 23న రాయవరం పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ నెల 24, 25 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఈ ప్రత్యేక క్యాంపుల ద్వారా ఆధార్ నమోదు, సవరణల ప్రక్రియ జరుగుతుందన్నారు.

సమగ్ర భూ సర్వేపై నేటి నుంచి గ్రామ సభలు

కాజులూరు: సమగ్ర భూ సర్వేపై శనివారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి.వేగేశ్వరరావు తెలిపారు. కాజులూరులో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండల పరిధిలోని గ్రామాల్లో గతేడాది రెవెన్యూ సిబ్బంది సమగ్ర భూ సర్వే చేశారన్నారు. దీనిపై గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి పేర్ల నమోదు తదితర అంశాలపై అభ్యంతరాలు సరి చేస్తామన్నారు. తొలిరోజు జగన్నాథగిరిలో గ్రామ సభలు జరుగుతాయన్నారు. నవంబర్ 19వ తేదీ వరకూ ఈ గ్రామసభలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోర్టు ఏర్పాటు చేయాలంటూ ఎంపీకి వినతి

కపిలేశ్వరపురం: నియోజకవర్గ కేంద్రమైన మండపేటలో జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఏర్పాటు చేయాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి ఆ పార్టీ మండపేట నియోజకవర్గ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయిరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గొడవర్తి రామచంద్రరావు రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో అధినాయకులను కలిశారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సిద్ధార్థ సింగ్ దృష్టికి తమ విజ్ఞప్తిని తీసుకెళ్ళారు. నియోజకవర్గ ప్రజల ప్రయోజనార్థం తమ విజ్ఞప్తిని పరిశీలించాలని కోరామని సాయిరాం తదితరులు చెప్పారు.

19 నుంచి రెవెన్యూ గ్రామసభలు

మండపేట: మండలంలో ఈ నెల 19 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ తేజేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ల్యాండ్ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ సభలు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలు, విస్తీర్ణం హెచ్చుతగ్గులు, జాయింట్ ఎల్‌పీఎంలు, ఖాతా నంబర్ తప్పులు, మ్యూటేషన్ల సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. 19న మారేడుబాక, 21న ఇప్పనపాడు, 22న వెలగతోడు, 23న ద్వారపూడి, 24న పాలతోడు, 25న మెర్నిపాడు, 26 చిన ద్వారపూడి, 28 జెడ్.మేడపాడు, 29 అర్తమూరు, 30 వేములపల్లి సీతయ్యపాలెం నవంబర్ 1న ఏడిద, 2న తాపేశ్వరం, 4న కేశవరం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నామన్నారు.


ట్రూ అప్ చార్జీల పేరిట భారం సరికాదు

కపిలేశ్వరపురం: సర్దుబాటు చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతోందని సీపీఎం సీనియర్ నాయకుడు జిత్తుక చినవీర్రాజు అన్నారు. స్థానికంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచమంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారని, నాలుగు నెలల్లోనే హామీలను తుంగలోకి తొక్కి ట్రూ అప్ చార్జీలను మోపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలపై ఏడాదికి రూ.8,114 కోట్ల భారాన్ని జనంపై మోపేందుకు సిద్ధమైందని అదే చేయదలచుకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పని వీర్రాజు అన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడు, బాపనయ్యచెరువు గ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. నెలపర్తిపాడులో రూ.7 లక్షలు, బాపనయ్యచెరువలో రూ.3 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కదలి పద్మజ్యోతి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు



రామచంద్రపురం

రాజగోపాల్	:	ఇద్దరు
కిషోర్	:	వేట్టయాన్ (మార్నింగ్ షో, ఫస్ట్‌షో) విశ్వం (మాట్నీ, సెకండ్ షో)
శ్రీసూర్య	:	దేవర

ట్రాఫిక్ సమస్యకు మోక్షమెప్పుడో ?



కాకినాడ-కోటిపల్లి రహదారిపై స్టేట్ బ్యాంక్ వద్ద రోడ్డుకు ఇరువైపులా నిలిపిన వాహనాలు

- రహదారులను కమ్మేస్తున్న వాహనాల పార్కింగ్
- ఇరుకుగా మారుతున్న రోడ్లు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

కాజులూరు: కాకినాడ-కోటిపల్లి రహదారిలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. మండలంలో ప్రముఖ వ్యాపారకేంద్రంగా అభివృద్ధి చెందుతున్న గొల్లపాలెంలో కొందరు షాపుల యజమానులు రోడ్డు మార్జిన్ వరకూ దుకాణాలను విస్తరించడంతో పాటు డ్రైనేజీలపై అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. దీంతో షాపుల వద్దకు సరకుల కోసం వచ్చిన వినియోగదారులకు పార్కింగ్ సదుపాయం లేక తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుదల చేస్తున్నారు. ఫలితంగా ఇరువైపులా వాహనాల పార్కింగ్‌తో రోడ్డు ఇరుకుగా మారిపోతోంది. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆదేశాలు బేఖాతరు

గతంలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించే విషయంలో ఆర్అండ్‌బీ అధికారులు రోడ్ ఎంక్రోజ్‌మెంట్ చేసి షాపులు రోడ్డు మార్జిన్‌కు 16 అడుగులకు మించి ముందుకు నిర్మించ వద్దని ఆదేశాలు జారీ చేశారు. కొన్నాళ్ల తర్వాత షాపులు రోడ్డు మార్జిన్ దాటి డ్రైనేజీల పైకి వచ్చేశాయి. దీంతో గొల్లపాలెంలోని కోళ్లతూము సెంటర్, కాజులూరు జంక్షన్, భవానీ థియేటర్ సెంటర్, మార్కెట్ జంక్షన్, జగన్నాథగిరి, ఆర్యావటం తదితర సెంటర్లలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరంగా మారింది.

పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో..

గొల్లపాలెంలో ఈ రహదారిని ఆనుకుని ఒక ప్రైవేటు గృహంలో స్టేట్ బ్యాంక్‌ను అద్దెకు నిర్వహిస్తున్నారు. దీనికి పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుదల చేస్తున్నారు. దీంతో ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. కోనసీమ, కాకినాడ జిల్లాలకు అనుసంధానంగా ఉన్న ఈ రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం మండలాల్లోని గ్రామాలతో పాటు కాజులూరు మండల గ్రామాల ప్రజలు సమీప నగరమైన కాకినాడకు వెళ్లాలంటే ఈ రహదారే ప్రధానమార్గం. ఇరువైపులా వాహనాల పార్కింగ్‌తో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతుండటంతో ఎందరో క్షతగాత్రులుగా మారుతున్నారు. కొందరు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలూ ఉన్నాయి. ఇటీవల కాజులూరు జంక్షన్‌లో హెరిటేజ్ పాల వ్యాన్ ఢీకొని ఆర్యావటానికి చెందిన కోట వెంకటరావు అనే వ్యక్తి మృతి చెందాడు. శలపాక జంక్షన్‌ల్లో ట్రావెల్ బస్సు ఢీకొని పసలపూడికి చెందిన కడుపూడి శ్రీనివాస్ మృతి చెందాడు. మండలానికి చెందిన రక్షణ కార్యాలయం గ్రామంలోనే ఉన్నప్పటికీ రోడ్డుపై వాహనాల పార్కింగ్ సమస్యను వారు ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి పైకి వాహనాలు పార్కింగ్ చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు అంతరాయం



రహదారికి ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రోడ్డు మార్జిన్‌లో ఎవ్వరూ వాహనాలు నిలుపుదల చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి. ప్రధాన సెంటర్లల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

కురవాడ కొండబాబు, ప్రయాణికుడు

అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం



గొల్లపాలెంలో స్టేట్‌బ్యాంక్‌ను పార్కింగ్ సదుపాయం ఉన్న చోటికి మార్చాలని గతంలో పలుమార్లు బ్యాంక్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. వారు వినకపోవటంతో బ్యాంక్ ఎదుట వాహనాలు పార్కింగ్ చేసేవారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ అధికారులు, పోలీసులకు ఫిర్యాదులు చేశాం. అయినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోలేదు.

కేసన వీర్రాజు, ప్రయాణికుడు

సమస్యలపై గళమెత్తి..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి



పామర్రులో పీహెచ్‌సీ కొత్త భవనాన్ని అందుబాటులోకి తేవాలని కోరుతున్న ఎంపీటీసీ లక్ష్మణ్

- అధికారులను ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు
- కె.గంగవరం మండల సమావేశం

కె.గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వెలుగు, ఎంజీఎన్ఆర్‌జీఎస్, వైద్య, విద్య తదితర శాఖల అధికారులు నివేదికను చదివి వినిపించారు. ఆయా శాఖలకు చెందిన సమస్యలపై అధికారులను సభ్యులు నిలదీశారు. జగనన్న కాలనీల్లో రోడ్లు నిర్మించడంతో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలని పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు కోరారు. కోట సర్పంచ్ సునీత మాట్లాడుతూ గ్రామంలోని మంచినీటి చెరువులో పూడిక పేరుకుపోవడంతో తాగునీరు సరఫరాలో జాప్యం జరుగుతోందన్నారు. వెంటనే మండల పరిషత్ నిధులు వెచ్చించి చెరువును బాగు చేయాలని కోరారు. కూళ్ల సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థలం ఇప్పించాలని కోరారు. పంచాయతీ తీర్మానం చేసి పంపితే సమస్యను పరిష్కరిస్తామని ఎంపీపీ నాగమణి తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.1.80 లక్షలతో నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకువాలని ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ వైద్య సిబ్బందిని కోరారు. దీనిపై ఎంపీడీఓ ఎస్. శ్రీనివాసరావు, వైద్య శాఖ సిబ్బంది మాట్లాడుతూ భవన నిర్మాణం పూర్తయినా ఇంకా ట్రాన్స్‌ఫార్మర్, ఫర్నీచర్ ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లా అధికారులకు నివేదించి పీహెచ్‌సీని అందుబాటులోకి తెస్తామన్నారు.

సమన్వయంతో పని చేయాలి

మండల, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ నాగమణి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమం ఏదైనా సరే ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. వరిసాగు విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో అధికారులు రైతులకు అండగా ఉండాలని కోరారు. తహసీల్దార్ మృత్యుంజయరావు, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, వైస్ ఎంపీపీలు దూడల నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోతులు.. రాకపోకలకు వెతలు



వెదురుమూడి ఓఎన్‌జీసీ మలుపు వద్ద లోతైన గుంతలతో రహదారి

కపిలేశ్వరపురం: మండలంలోని ఆర్ అండ్ బీ రహదారులు ఛిద్రమై ప్రమాదభరితంగా మారాయి. ప్రధాన కూడలి గ్రామమైన అంగర నుంచి ఏ గ్రామానికి వెళ్లాల్సి వచ్చినా లోతైన గుంతలను దాటుకునే వెళ్లాల్సిన పరిస్థితి. మండల కేంద్రమైన కపిలేశ్వరపురం-అంగర రహదారి పొడవునా ఛిద్రమైంది. రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండల పరిషత్, తహసీల్దార్, ఐసీడీఎస్, ఎంఈఓ తదితర ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు వెళ్లే అధికారులు సమస్యలతో సతమతం అవుతున్నారు. అంగర- వెదురుమూడి రహదారి పొడవునా ఇదే పరిస్థితి. వెదురుమూడి-వల్లూరు రోడ్డులోని ముదుగు కాలువ వెంబడి రహదారి ఛిద్రమైంది. కపిలేశ్వరపురం మండలంలోని వెదురుమూడి - ఆలమూరు మండలంలోని సందిపూడి రహదారిలో పలుచోట్ల లోతైన గుంతలు పడి ప్రమాదభరితంగా మారాయి. వర్షపు నీటితో నిండిన గోతుల్లో జనం జారిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదేనా 'స్వచ్ఛతా హి సేవ' ?



రాయవరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొలిచిన పిచ్చి మొక్కలు



మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయం దుస్థితి

రాయవరం: గత నెలలో పక్షం రోజులు స్వచ్ఛతాహి సేవలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. గత నెల 16 నుంచి అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి వరకూ మండల పరిషత్ అధికారుల ఆధ్వర్యంలో పక్షోత్సవాలు నిర్వహించారు. అయితే అదే కార్యాలయంలో మాత్రం స్వచ్ఛతా కార్యక్రమాన్ని విస్మరించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణ అంతా పిచ్చిమొక్కలతో నిండి ఉండడం దీనికి తార్కాణం. ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న ఒకప్పటి మండల వ్యవసాయశాఖ కార్యాలయంపై పిచ్చి మొక్కలు మొలిచినా పట్టించు కోలేదు. ప్రస్తుతం ఆ కార్యాలయం నిరుపయోగంగా మార్చారు. అదే సొంత భవనమైతే ఇలాగే వదిలేస్తారా? అంటూ మండల పరిషత్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజల సొమ్ముతో నిర్మించే ప్రభుత్వ భవనాలను ఇలాగే వదిలేస్తారా? అనే ప్రశ్నలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు మండల పరిషత్ కార్యాలయాన్ని కనీసం ఉపాధి హామీ పనుల్లో భాగంగా కార్యాలయం పరిసరాల్లో ఉన్న పిచ్చిమొక్కలను, గడ్డిని తొలగించే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇస్తినమ్మా వాయనం.. పుచ్చుకుంటినమ్మా వాయనం

- నేడు అట్ల తద్దె పర్వదినం
- నోముకు సిద్ధమైన మహిళలు



పూజకు సిద్ధం చేసుకున్న జాజాల బుట్టలు

రాయవరం: పసుపు కుంకాలు చల్లగా ఉండాలని, పాడి పంటలు కలగాలని, పిల్లాపాపలకు అరిష్టాలు కలగకూడదంటూ హిందూ మహిళలు పలురకాల నోములు నోస్తుంటారు. వాటిలో ఆశ్వయుజ మాసం బహుళ తదియ రోజు నోచే అట్లతద్దె నోము ప్రధానమైంది. మాంగళ్య బలం కోరుతూ గౌరీదేవిని భక్తి ప్రపత్తులతో ముత్తైదువలు, ముఖ్యంగా నవ వధువులు ఈ నోము నోచడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. వాయనాలుగా ప్రసిద్ధి చెందిన అట్లతద్దె నోమును నోచుకునేందుకు మహిళలు సిద్ధమయ్యారు. శనివారం అట్లతద్దె నోమును మహిళలు భక్తిశ్రద్ధలతో నోచేందుకు సిద్ధమయ్యారు.

వాయనం ప్రదానం

అట్లతద్దోయ్ ఆరట్లోయ్..ముద్ద పప్పోయ్ మూడట్లోయ్...అంటూ మహిళలు ఆట పాటలతో కోలాహలంగా ఈ పండుగ జరుపుకుంటారు. సూర్యోదయానికి ముందుగానే లేచి స్నానపానాదుల నాలుగు నుంచి ఐదు గంటల లోపుగా భోజనం చేసి వ్రతాన్ని ప్రారంభిస్తారు. మజ్జిగ అన్నం, గోంగూర పచ్చడి, నువ్వుల పొడి, ఉల్లిపాయల పులుసు, గడ్డ పెరుగుతో భోజనం చేస్తారు. సాయంత్రం వరకూ ఉపవాసం ఉంటారు. కొత్తగా వివాహమైన యువతులు విధిగా అట్లతో వాయనాలు ఇస్తారు. సాయంత్రం కాలువ వద్దకు వెళ్లి కాలువలో మట్టిని, వరి దుబ్బులను, జాజాల బుట్టలను గౌరీదేవిగా భావించి పూజలు చేస్తారు. నీళ్లలో గౌరమ్మ..పాలల్లో గౌరమ్మ అంటూ పాటపాడుతూ పూజ అనంతరం వాటిని కాలువలో కలుపుతారు. అట్లతద్దెకి ఐదు రోజుల ముందుగా చిన్న చిన్న బుట్టల్లో మట్టి వేసి అందులో మెంతులు, పెసలు, కందులు, పత్తి తదితర నవధాన్యాలను వేస్తారు. అట్లతద్ది రోజున మొలకలు వచ్చే విధంగా చూస్తారు. వీటినే జాజాలుగా పిలుస్తారు.

గర్భదోషాలు కలగకుండా

స్త్రీలు సౌభాగ్యం కోసం చేసుకునే వ్రతంలో చంద్రారాధన ప్రధానమైన పూజ. చంద్రకళల్లో కొలువై ఉన్న పరాశక్తి అనుగ్రహంతో స్త్రీ సౌభాగ్యం పెరుగుతుందని భక్తుల విశ్వాసం. రజోదయానికి కారకుడైన కుజుడు ఋతు సమస్యలు రాకుండా కాపాడతాడని నమ్మకం భక్తుల్లో ఉంది. గర్భధారణలో ఎటువంటి సమస్యలు రాకుండా మినప, బియ్యం పిండితో కూడిన అట్లను నైవేద్యంగా సమర్పిస్తారు. మినుములు రాహువుకు, బియ్యం చంద్రునికి ప్రీతికరమైన ధాన్యాలు. గర్భదోషాలు తొలగేందుకు వివాహమైన వెంటనే నవ వధువులు అట్లను వాయనంగా ఇస్తారు. గర్భస్రావం రాకుండా, సుఖ ప్రసవం అయ్యేందుకు అట్లతద్దె రోజున ముత్తైదువులకు వాయనం ఇవ్వాలని పురోహితులు చెబుతున్నారు.

ఉయ్యాల ఊగుతూ.. గోరింటాకు పెట్టుకుంటూ

అట్లతద్దె రోజున మహిళలు విధిగా ఉయ్యాల ఊగుతారు. ముందురోజున మహిళలు గోరింటాకు కూడా పెట్టుకుంటారు. కాలువల వద్దకు వెళ్లే సమయంలో పెళ్లి పీటలపై కట్టుకున్న పట్టుచీరను తప్పనిసరిగా ధరిస్తారు.

చంద్ర దర్శనంతోనే విరమణ

ఉదయం నుంచి ఉపవాసం చేసే మహిళలు సాయంత్రం పూజ అనంతరం చంద్ర దర్శనం కోసం వేచి చూస్తారు. చంద్రుడు కన్పించిన తర్వాత పూజ చేసుకున్న అనంతరం ఉపవాస దీక్ష విరమిస్తారు.

క్లస్టర్ పరిధిలో..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలోని 120 గ్రామాలకు చెందిన మహిళలు అట్లతద్ది నోమును నోచేందుకు సమాయత్తమవుతున్నారు. నోముకు అవసరమైన పూజాసామగ్రిని సిద్ధం చేసుకునే పనిలో మహిళలు ఉన్నారు.

జోరువాన

పల్లపు ప్రాంతాలు జలమయం



గొల్లపాలెంలో కురుస్తున్న భారీ వర్షం

కాజులూరు: మండల వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. గత రెండు రోజుల నుంచి చిరుజల్లులు పడుతుండగా శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భారీ వర్షం పడటంతో ప్రజలు బయటకు వచ్చేందుకు వీలు లేకుండా పోయింది. గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాకినాడ-కోటిపల్లి రహదారిలో చెరువు గట్టు సెంటరు వద్ద భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో ప్రస్తుతం వరిపొలాలు చిరుపొట్ట దశ నుంచి ఈనిక దశలో ఉన్నాయి. ఈ తరుణంలో వర్షాల కారణంగా వరిపై కాండం తొలుచు పురుగు, మాగుడు తెగులు ఆశించే ఆవకాశం ఉందని, మొవ్వులో నీరు చేరితే గింజ చప్పబడిపోయి దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇసుక తవ్వకాలు పారదర్శకంగా జరపాలి

కపిలేశ్వరపురం: ఉచిత ఇసుక పథకంలో భాగంగా తవ్వకాలను నిబంధనలు మేరకు పారదర్శకంగా జరపాలని, లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని గోదావరి తీర గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు అధికారులను డిమాండ్ చేశారు. ఆ పార్టీ కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామ శాఖల అధ్యక్షుడు కట్టా మురళి, గూటం సత్యనారాయణ తదితరులు శుక్రవారం మాట్లాడుతూ ప్రస్తుతం ఇసుక కొరత తీవ్రంగా లబ్ధిదారులను పట్టిపీడిస్తుందని, ప్రభుత్వం స్పందించి ఇసుకను అందుబాటులోకి తేవాలని, పారదర్శకంగా ఇసుకను ఉచితంగా అందజేయాలని మురళి, సత్యనారాయణ డిమాండ్ చేశారు.

ఈదురు గాలులకు నేల కొరిగిన వరిచేలు



పసలపూడిలో నేలకొరిగిన వరి పంట

రాయవరం: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు వరి పంట నేలకొరిగింది. పలు గ్రామాల్లో పంట ప్రస్తుతం ఈనిక దశలో ఉండగా, ముందుగా ఊడ్చిన వరిచేలు గింజ పాలు పోసుకునే దశలో ఉన్నాయి. ఈ దశలో కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో వరి పంట నేల కొరిగింది. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో తెగుళ్ల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా వరి పంట నేలకొరిగింది. దీని వలన రైతులకు ఆర్థికంగా నష్టం వాటిల్లే పరిస్థితి తలెత్తింది. పడిపోయిన పంటను తిరిగి సాళ్లుగా కట్టేందుకు రైతులపై అ'ధన'పు భారం పడుతుంది. రైతులపై ప్రకృతి పగబట్టినట్లుగా ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల ఫోన్ నంబర్లు

కపిలేశ్వరపురం మండలం కార్యదర్శులు

కపిలేశ్వరపురం -1	కె శివచక్రవర్తి	9948970046
కపిలేశ్వరపురం -2	కె పండు	9441818405
తాతపూడి	బ్రహ్మాజీరావు	9381725156
అంగర -1	ఆర్ఎంవీవీఎస్ ఈశ్వరరావు	9618861999
అంగర -2	మహమ్మద్ ఆలీ షేక్	9652244131
పడమర ఖండ్రిక	పి.సత్తిబాబు	9676273393
వెదురుమూడి	వై. శారద	8790515028
వల్లూరు	కె.సత్తిబాబు	9959545391
నేలటూరు	పి.మోహన్	8008707882
నిడసనమెట్ట	జి.విజయకుమార్	9550096513
వడ్లమూరు	జి.చినబాబు	9985384544
నల్లూరు	పి.రమేష్	9618988149
కాలేరు	యు.సుప్రియ	7981281398
కాలేరు	జి.దేవి ప్రసన్న	9550124927
టేకి	కె. రామకృష్ణ	9951480999
టేకి	ఎస్.శ్రీనివాసు	8978306474
కేదారిలంక	పి.మోహన్	8008707882
మాచర	జి.చినబాబు	9985384544
కోరిమిల్లి -1	ఆర్ఎస్‌వీకామేశ్వరరావు	908852108
కోరిమిల్లి -2	కె.శంకరమూర్తి	9502121667
నాగులచెరువు	కె.యశ్వంత్ కుమార్	7780276777
వాకతిప్ప	పి.వెంకటేశులు	8919435971
అద్దంకివారిలంక	పి.మోహన్	8008707882